పింఛన్ల నగదు పెరగడంతో ఎంతో మేలు


పీఎంపాలెంలో పింఛను నగదు అందుకున్న ఆనందంలో వృద్ధులు, దివ్యాంగులు


భీమిలిలో పింఛను నగదు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం: అర్హులందరికీ ఈ నెల నుంచి పింఛను మొత్తం రూ.2500 నుంచి రూ.2750కు పెరిగిందని... దీనివల్ల వారికి ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జోన్ – 1 పరిధిలోని నాలుగు వార్డుల్లో కొత్తగా 332 మందికి పింఛన్లు మంజూరుకాగా వాటిని ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో ఎవరికీ ఇలా పింఛన్లు పెరగడం జరగలేదని, ఈ విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, ఆయన ఇచ్చిన హామీలు నెరవేర్చుతున్నారన్నారు. పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ పింఛన్లు అందిస్తున్నారని, గతంలో ఇలా ఎన్నడూ జరగలేదన్నారు. అర్హులకు పింఛన్లు అందాలన్న ఉద్దేశంతో కొన్నింటిని పరిశీలిస్తుంటే వాటిని తొలగిస్తున్నట్టు ప్రతిపక్షాలు ప్రచారం చేస్తున్నాయన్నారు. ఎవరు ఎన్ని విధాలుగా దుష్ప్రచారాలు చేసినా ప్రజలు వాటిని ఎప్పుడో నమ్మడం మానేశారన్నారు. ఈ సందర్భంగా ఆయన అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పడంతోపాటు పార్టీ నాయకుల సమక్షంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో 3, 4 వార్డుల కార్పొరేటర్లు గంటా అప్పలకొండ, దౌలుపల్లి కొండబాబు, వైఎస్సార్ సీపీ 3వ వార్డు అధ్యక్షుడు అల్లిపిల్లి నర్సింగరావు, ఇన్‌చార్జి ఎం.షణ్ముఖరావు, జోనల్ కమిషనర్ వెంకటరమణ పాల్గొన్నారు.

టీడీపీ మాజీ కౌన్సిలర్ భార్యకు పింఛను

ఏ పార్టీ వారైనా అర్హులైతే అన్ని సంక్షేమ పథకాలు అందిస్తామని సీఎం జగన్ మోహన్‌రెడ్డి పదేపదే ప్రకటిస్తున్నందుకు ఆదివారం ఒక మహిళకు కొత్తగా మంజూరైన పింఛనే మంచి ఉదాహరణ. ఇక్కడ చిన్నబజారు ప్రాంతంలోని టీడీపీ మాజీ కౌన్సిలర్ అప్పికొండ సూరిబాబు భార్య అప్పికొండ సిమ్మప్పకు సాంకేతిక కారణాల వల్ల ఇన్నాళ్లూ పింఛను రాలేదు. ఈ విషయాన్ని ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి ఆమె తీసుకొచ్చారు. వెంటనే ఆయన స్పందించి చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించడంతో ఆమెకు కొత్తగా పింఛను మంజూరయ్యింది. ఆ నగదు వలంటీర్ ఆదివారం అందజేశారు.

శుభోదయాన పింఛన్ల సంబరం

మధురవాడ: కొత్త సంవత్సర వేడుకలు ఒక వైపు, పెరిగిన పింఛన్ మొత్తం... కొత్తగా పింఛన్ మంజూరైన ఆనందం మరో వైపు అన్నీ కొత్త ఆశలు రేకెత్తించాయి. మంచు తెరలు కూడా తొలగకముందు వేకువజామున ఇంటి తలుపు తట్టి వలంటీర్లు పింఛన్లు అందించారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు ఆనందంలో మునిగిపోయారు.

మధురవాడ జోన్‌కి 1,047 కొత్త పింఛన్లు

జీవీఎంసీ మధురవాడ జోన్ – 2కి చెందిన 5 నుంచి 13 వరకు గల 9 వార్డుల్లో కొత్తగా 1,047 మందికి పింఛన్లు మంజూరయ్యాయి. 5వ వార్డులో 208, 6లో 207, 7లో 176, 8లో 135, 9లో 32, 10లో 99, 11లో 111, 12లో 69, 13లో 10 మందికి పింఛన్లు వచ్చాయి. జోన్‌లో మొత్తం 19,281కి ఈ నెల నుంచి పింఛన్ అందుతోంది. వీటిని ఆదివారం ఆయా వార్డుల్లోని వివిధ ప్రాంతాల్లో నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు లబ్ధిదారులకు అందజేశారు.


టీడీపీ మాజీ కౌన్సిలర్ భార్య సిమ్మప్పకు పింఛను నగదు అందిస్తున్న వలంటీర్


నాయకులతో నూతన సంవత్సర కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పీఆర్‌టీయూ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ


పీఆర్‌టీయూ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఆర్‌జేడీ జ్యోతి కుమారి తదితరులు

మధురవాడ: పీఆర్‌టీయూ డైరీ, వార్షిక క్యాలెండర్‌ను ప్రాంతీయ పాఠశాల విద్యా శాఖ సంచాలకులు ఎమ్.జ్యోతి కుమారి మధురవాడలోని ఆర్‌జేడీ కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె ఉపాధ్యాయులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.గోపీనాథ్, ఎమ్.శ్రీనివాసరావు, అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్.పెద్దినాయుడు, ఉపాధ్యక్షుడు జి.శ్రీరామమూర్తి, కార్యాలయం సూపరింటెండెంట్ ఆనందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని ఒకరికి గాయాలు

పద్మనాభం: మండలంలోని విజయానందపురంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయని ఏఎస్‌ఐ నక్కా శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... విజయానందపురానికి చెందిన జక్కపు కొండలరావు(51) శనివారం ఉదయం మల మూత్ర విసర్జన కోసం రోడ్డు దాటుతుండగా విజయనగరం జిల్లా జామి మండలం భీమసింగికి చెందిన దనియాల అజయ్ బైక్‌తో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కొండలరావుకు తలపై గాయాలయ్యాయి. దీనిపై కొండలరావు కుమారుడు పవన్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు.

క్లుప్తంగా

సంపూర్ణ స్వర్ణకవచధారణలో శ్రీవారు


సంపూర్ణ స్వర్ణకవచధారణలో భక్తులకు దర్శనమిచ్చిన వేంకటేశ్వరస్వామి

ఆనందపురం : మండలంలోని గంభీరంలో వేంచేసి ఉన్న శ్రీశరణ్య వేంకటేశ్వర స్వామి వారు ఆదివారం సంపూర్ణ స్వర్ణ కవచధారణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా శ్రీవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఉదయం 5:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకూ భక్తులకు శ్రీవారి దర్శనం కల్పించి ఆరు రకాల ప్రసాదాలను వితరణ చేశారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన భక్తులు భారీగా తరలివచ్చారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా సోమవారం శ్రీవారు ఉత్తర ద్వార దర్శనమివ్వనున్నారని ఆలయ ధర్మకర్త పైడా కృష్ణ ప్రసాద్ తెలిపారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

కొమ్మాది: జీవీఎంసీ 6వ వార్డు సాయిరాం కాలనీలో గల శ్రీ దుర్గా భవానీ భవన నిర్మాణ శ్రామిక సంక్షేమ సంఘం సభ్యులు ఆదివారం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలతోపాటు భవన నిర్మాణ కార్మికులకు ఈ సంఘం అండగా ఉంటుందని తెలిపారు. సంఘం అధ్యక్షుడు వైఎస్ మూర్తి, గౌరవ అధ్యక్షుడు యోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని ఒకరు మృతి

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో పాత గాజువాక శ్రామికనగర్‌కు చెందిన చప్పా గౌరీశ్వరరావు(53) అనే వ్యక్తి మృతి చెందాడు. ఇదే ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న కరుభుక్త ఈశ్వరరావు(50), కంటుభుక్త పాపయ్య(60) అనే వ్యక్తులు తీవ్రంగా గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. భీమిలి ఎస్‌ఐ గంటా హరీష్ తెలిపిన వివరాల ప్రకారం... ట్యాంకర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న గౌరీశ్వరరావు తాళ్లవలస పెట్రోల్ బంకు వద్ద వాహనం నిలిపి టీ కోసం రోడ్డు దాటుతుండగా... ఆనందపురం నుంచి తగరపువలస వైపు నిర్లక్ష్యంగా, వేగంగా వచ్చిన ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గౌరీశ్వరరావు తలపై బలమైన గాయాలు కాగా ఆటోలోని ప్రయాణికులు కూడా కిందపడి గాయపడ్డారు. వీరిని చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించగా రాత్రి 8.30 సమయంలో గౌరీశ్వరరావు మృతి చెందాడు. మృతుని కుమారుడు మధు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలకు ముగ్గుల పోటీలు

తగరపువలస: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని జీవీఎంసీ రెండో వార్డు ఆదర్శనగర్‌లో శనివారం రాత్రి మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. జీవీఎంసీ విశ్రాంత ఉద్యోగి బంగారు పరదేశి ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో పదుల సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. వీరికి పరదేశి బహుమతులు అందించారు.

విశ్వశాంతి కోసం శ్రీనరసింహ యజ్ఞం


నరసింహ యజ్ఞం నిర్వహిస్తున్న రుత్వికులు

ఆనందపురం : హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో మండలంలోని గంభీరంలో హరేకృష్ణ వైకుంఠ మందిరం నిర్మాణ ప్రదేశంలో శ్రీనరసింహ యజ్ఞం ఆదివారం నిర్వహించారు. నూతన ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకొని విశ్వశాంతిని కాంక్షిస్తూ రుత్వికులు యజ్ఞం చేశారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకూ భక్తులు అఖండ హరి నామ సంకీర్తన చేశారు. దీంతో ఆ ప్రాంతం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస ప్రవచిస్తూ ప్రజల్లో ఆధ్యాత్మిక అవగాహన లేకపోవడం వల్ల ప్రశాంతత కొరవడి మానసిక ఒత్తిళ్లకు లోనవుతున్నారని వివరించారు. హరినామ సంకీర్తన వల్ల ప్రజలంతా ఐకమత్యంతో ప్రశాంతంగా జీవిస్తారని చెప్పారు. హరినామ సంకీర్తనను 1960 ప్రాంతంలో భక్తి వేదాంత స్వామి ప్రభుపాదుల వారు విశ్వవ్యాప్తం చేశారని వివరించారు. కార్యక్రమంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి యదురాజా దాస తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశి దర్శనాలకు ఏర్పాట్లు


విశేష అలంకరణలో శ్రీదేవి భూదేవి సమేత రంగనాథస్వామి విగ్రహాలు


వేంకటేశ్వరస్వామి ఆలయంలో పుష్పాలంకరణ సేవ

తగరపువలస: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పలు వైష్ణవాలయాల్లో భక్తులకు సోమవారం ఉత్తర ద్వార దర్శనాలు అందించడానికి ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నాయి. వేకువజామున 3 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు రద్దీ కొనసాగుతుందని అంచనా. చాలా వరకు ఆలయాలు తూర్పు, పడమర ద్వారాలు కలిగి ఉండటంతో ప్రస్తుతం వాటిని మూసివేసి ఉత్తర ద్వారాలు తెరుస్తున్నారు. ఈ మేరకు తాత్కాలికంగా కర్రలు, చీరలు, పరదాలతో కొత్తగా క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. విగ్రహాలు, ఆలయాలు, మెట్లమార్గాలకు కొత్త రంగులు వేస్తున్నారు. పూలదండలు, తులసి మాలలు, మామిడితోరణాలు, విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. భక్తులకు తాగునీరు, ప్రసాదం పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. వెంకటేశ్వరమెట్టపై శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయం, సత్యనారాయణమెట్టపై రమాసత్యనారాయణస్వామి ఆలయం, మెయిన్‌రోడ్డులోని షిర్డీసాయిబాబా, సీతారామలక్ష్మణస్వామి ఆలయం, వలందపేట, సంతపేట, నమ్మివానిపేట, సంగివలస కాలనీ, జీరుపేట, టి.నగరపాలెం, మజ్జివలస, కృష్ణంరాజుపేట, చిట్టివలస జ్యూట్‌మిల్లు సీతారామాలయం, దాకమర్రి వల్లభ లక్ష్మీ నారాయణస్వామి ఆలయంతోపాటు గ్రామాల్లో ఉన్న షిర్డీ సాయిబాబా, సీతారామాలయాల్లో ఉత్తరద్వార దర్శనాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేశారు.

పద్మనాభం: పద్మనాభంలోని అనంత పద్మనాభ స్వామి గిరి దిగువన ఉన్న కుంతీ మాధవ స్వామి ఆలయంలో సోమవారం ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేశారు. ముందుగా స్వామిని రూ.3.30 గంటలకు సుప్రభాత సేవతో మేలుకొలుపుతారు. నాలుగు గంటలకు పంచామృత అభిషేకాలు నిర్వహిస్తారు. తదుపరి శ్రీదేవి భూదేవి సమేత రంగనాథ స్వామి విగ్రహాలను పల్లకీలో గ్రామంలో ఊరేగించి కుంతీ మాధవ స్వామి ఆలయంలో ప్రత్యేకంగా రూపొందించిన వేదికపైకి తోడ్కొని వచ్చి కొలువు దీర్చుతారు. అనంతరం భక్తులకు ఆరు గంటలకు ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తారు. కుంతీ మాధవ స్వామి ఆలయం లోపల పూల తోరణాలతో అందంగా అలంకరించారు.

ఉత్తర ద్వార దర్శనానికి ఆలయాలు ముస్తాబు

మధురవాడ: వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనాలకు మధురవాడలోని నారాయణుడి దేవాలయాలు సిద్ధమయ్యాయి. అష్టలక్ష్మి సమేత లక్ష్మీ నారాయణ స్వామి ఆలయం, మానం ఆంజనేయులు నగర్‌లోని భద్రాద్రి రాముని ఆలయం, మిథిలాపురి ఉడా కాలనీ, శ్రీనివాస నగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయాలు, బక్కన్నపాలెంలోని కోదండ రామాలయం సిద్ధమయ్యాయి. ఆయా ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనానికి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.


రమా సత్యనారాయణస్వామి ఆలయంలో పుష్పాలంకరణ


ముస్తాబైన బక్కన్నపాలెంలోని కోదండరాముడు

ఉత్సాహంగా న్యూ ఇయర్ వేడుకలు


కార్పొరేటర్ అక్కరమాని పద్మకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు


అమనాంలో ఎంపీపీ వాసురాజుకు శుభాకాంక్షలు తెలియచేస్తున్న నాయకులు


మధురవాడలో కేక్ కట్ చేస్తున్న పౌర సంక్షేమ సంఘం నాయకులు

తగరపువలస: ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం స్థానిక ప్రజాప్రతినిధులను ఉద్యోగులు, నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కేక్‌లు కట్‌చేసి పుష్పగుచ్ఛాలు అందించారు. జీవీఎంసీ ఒకటో వార్డు కార్పొరేటర్ అక్కరమాని పద్మ, రామునాయుడు దంపతులను, కో ఆప్షన్ సభ్యురాలు కొప్పల ప్రభావతి, రమేష్ దంపతులను వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో నాయకులు సత్కరించారు.

భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజును మండలంలోని అమనాంలో, శింగనబంద పంచాయతీ డొకరపేటలో జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడును, లక్ష్మీపురంలో వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడును వివిధ పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఉద్యోగులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. చిట్టివలస జ్యూట్‌మిల్లు ఇంటక్ అధ్యక్షుడు కాకర్లపూడి వరహాలరాజు, వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు కాకర్లపూడి శ్రీకాంత్ రాజును కార్మిక సంఘాల నాయకులు చిల్ల వెంకటరమణ, జీరు వెంకటరెడ్డి, కొయ్యి సూరిగురువులు, బొడ్డు నరసింగరావు కలిసి శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్ చేయించారు.

నూతన సంవత్సరంతో ఆలయాల్లో రద్దీ

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని తగరపువలస, చిట్టివలస, సంగివలస గ్రామాల్లో ఆలయాలు ఆదివారం రద్దీగా కనిపించాయి. ఉదయం నుంచి భక్తుల దర్శనాలతో సందడి నెలకొంది. కొత్త ఏడాదిలో అంతా శుభం కలగాలని అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. సంగివలస జాతీయ రహదారిపై కొత్తమ్మతల్లి, విజయదుర్గ, ప్రధాన రహదారిలో షిర్డీ సాయిబాబా తదితర ఆలయాల్లో ఎక్కువగా భక్తులు కనిపించారు. పలువురు తమ గ్రామదేవతలకు పసుపు – కుంకుమ, చీరలు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనాల అనంతరం స్నేహితులు, బంధువులకు శుభాకాంక్షలు తెలియజేశారు. చుట్టుపక్కల చర్చిలలో కూడా నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ప్రత్యేక ప్రార్థనలు చేసి భక్తి గీతాలు ఆలపించారు. పేదలకు వస్త్రాలు, కానుకలు, ధన సహాయం అందించారు.

పద్మనాభం: మండలంలోని పలు గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. మద్ది గ్రామంలోని ఎంపీపీ కంటుబోతు రాంబాబు, రెడ్డిపల్లిలోని జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు, కోరాడలోని వైస్ ఎంపీపీ కోరాడ మంజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, రెడ్డిపల్లిలోని వైస్ ఎంపీపీ ఈర్ల రాజేశ్వరరావు వద్దకు అధికారులు, ఉపాధ్యాయ సంఘ నాయకులు, అభిమానులు వెళ్లి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

పీఎం పాలెం: ఆంగ్ల సంవత్సరాది వేడుకలు ఆదివారం ఈ ప్రాంతంలో ఘనంగా నిర్వహించారు. కారుషెడ్ కూడలి, శ్రీ శృంగేరి శంకరమఠం శివాలయాల్లో వేకువజామున ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. బక్కన్నపాలెం రోడ్డులో ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు అనంతరం విశేష అలంకరణలో శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. బబ్బేలమ్మ ఆలయం, ఆర్‌హెచ్ కాలనీ పైడిమాంబ, నూకాలమ్మ ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. బేతని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

మధురవాడ: ఆంగ్ల సంవత్సరాది వేడుకలు మధురవాడలో ప్రజలు ఉత్సాహంగా జరుపుకున్నారు. పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంఘ అధ్యక్షుడు నాగోతి సూర్యప్రకాశరావు, బెల్లాపు పాపారావు, జగన్మోహనరావు, తాతపూడి ప్రదీప్ కుమార్ తదితరులు కేక్ కట్ చేశారు. సర్వమత సమభావనతో అంతా నడుచుకోవాలని పిలుపునిచ్చారు.


డొకరపేటలో జెడ్పీటీసీ సభ్యుడు వెంకటప్పడుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు


ఇంటక్ అధ్యక్షుడు వరహాలరాజుకు కేక్ తినిపిస్తున్న కార్మికసంఘ నాయకులు


ఎంపీపీ రాంబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు

శివానందమూర్తి ఆశ్రమానికి ఎమ్మెల్యే గంటా


శివానందమూర్తి విగ్రహానికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

భీమునిపట్నం: స్థానిక బ్యాంకు కాలనీ వద్ద ఉన్న సద్గురు శివానందమూర్తి ఆశ్రమాన్ని విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి నమస్కరించి నివాళులర్పించారు. అనంతరం అదే ఆవరణలో ఉన్న శ్రీమహాలక్ష్మి ఆలయాన్ని సందర్శించారు.

‘భానుమతి పాట సీవీ రాజేశ్వరి నోట’ రేపు

ఏయూ క్యాంపస్: గాయనిగా, నటిగా ఖ్యాతి చెందిన ‘భానుమతి పాట.. సీవీ రాజేశ్వరి నోట’శీర్షికతో మంగళవారం సినీ సంగీత విభావరి జరగనుంది. సంగీత దర్శకుడు ఏవీ కృష్ణారావు ఆధ్వర్యంలో జరగనున్న ఈ విభావరి పోస్టర్‌ను ఆదివారం ఉదయం ఏయూ వీసీ ప్రసాదరెడ్డి తన చాంబర్లో రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్‌తో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమ సమన్వయకర్త శైలజా మెరాజ్ గాయని, ఏయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్ సీవీ రాజేశ్వరి పాల్గొన్నారు.

బోనిలో హిందూ ధర్మ ప్రచారం


త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలతో బోని గ్రామస్తులు

ఆనందపురం : మండలంలోని బోని గ్రామంలో ఆదివారం త్రైత సిద్ధాంత హిందూ జ్ఞాన వేదిక, ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివరం హిందూ ధర్మ ప్రచారాన్ని నిర్వహించారు. విజయరాంపురం కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు, సభ్యులు కృష్ణ సూరప్పడు, పైడన్న, సన్యాసి, సురేష్, సత్యవతి తదితరులు ఇంటింటికీ వెళ్లి స్వామి వారు ప్రవచించిన ఆత్మ జ్ఞానాన్ని తెలుసుకొని అందరూ జ్ఞానులు కావాలని బోధించారు. గీత జ్ఞానం ద్వారా కర్మ విధానం తెలుసుకొని మోక్షం పొందాలని సూచించారు. కార్యక్రమంలో భీమిలి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు పాల్గొన్నారు.

మందగించిన నూతన సంవత్సర వ్యాపారాలు


అంబేద్కర్ కూడలిలో ఏర్పాటు చేసిన స్టాల్‌లో నాన్‌వెజ్ వంటకాలు

తగరపువలస: పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతూ డిసెంబర్ 31, జనవరి 1వ తేదీల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక వ్యాపారాలు మందగించాయి. తగరపువలసలో శనివారం ఏర్పాటు చేసిన ఫుడ్‌స్టాల్స్, బేకరీ వస్తువుల వ్యాపారులకు నిరాశే మిగిలింది. సాధారణంగా పాత ఏడాదికి వీడ్కోలు పలుకుతూ ప్రతి ఒక్కరూ నాన్‌వెజ్‌తో కూడిన బిర్యానీ, కబాబ్‌లు, సీ ఫుడ్స్, కేక్‌లు కొనుగోలు చేసి కుటుంబ సభ్యులతో ఎంజాయ్ చేస్తుంటారు. గతంలో వీటిని అందించడానికి వ్యాపారులు ఆపసోపాలు పడేవారు. ఈ రెండు రోజుల వ్యాపారాలకు నిర్వాహకులు పోటాపోటీగా డిస్కౌంట్లు, వన్ ప్లస్ వన్ ఆఫర్లతో ప్రచారం ఊదరగొట్టారు. అయితే వీడ్కోలు పలికే డిసెంబరు 31 శనివారం రావడంతో వ్యాపారుల అంచనాలు తారుమారయ్యాయి. స్టాల్స్‌లో ప్రదర్శనగా ఉంచిన నాన్‌వెజ్ అయిటమ్స్‌తో పాటు వండి వడ్డించిన బిర్యానీ సైతం మిగిలిపోయింది. కేక్‌లో కూడా కోడిగుడ్డు కలుస్తుందని భావించిన వినియోగదారులు ఎక్కువగా వాటి జోలికి వెళ్లలేదు. ఏటా ఈ సీజన్‌లో తగరపువలస కేంద్రంగా బేకరీల నుంచి 12వేలకు పైగా కేక్‌లు విక్రయమై రూ.60 లక్షల వరకు వ్యాపారం జరిగేది. కానీ ఈ ఏడాది లక్ష్యంలో మూడోవంతు కూడా కేక్‌లు విక్రయం కాలేదంటున్నారు వ్యాపారులు. జనవరి ఒకటో తేదీ ఆదివారం వచ్చినా వినియోగదారులు చేపలు, చికెన్, మటన్ కొనుగోలు చేసి రెస్టారెంట్లు, హోటళ్లు, దాబాల జోలికి పోలేదు. దీంతో పాత ఏడాది వీడ్కోలు, కొత్త ఏడాది స్వాగత సన్నాహాలు వ్యాపారులకు చేదు జ్ఞాపకంగా మిగిలిపోయాయి.